క్లుప్తంగా

బైరాపూర్‌లో 'జోడో యాత్ర'



నస్రుల్లాబాద్(బీర్కూర్): మండలంలోని బైరాపూర్, బరంగేడ్గి, సాంబాపూర్ గ్రామాలలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో 'హాత్ సే హాత్ జోడో యాత్ర' నిర్వహించారు. యాత్రలో ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ రావు పాల్గొని, మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.రెండు లక్షల ఋణ మాఫీ, భూమిలేని పేద కుంటుంబానికి రూ.15000 సంవత్సరానికి అందిస్తామన్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రహింపేట్, సోమేశ్వర్ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి తనిఖీ చేశారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు వడ్డించారు. ఎంపీవో సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు మాలెపు నారాయణరెడ్డి, పద్మ మొగులయ్య, నాయకులు దేవారం నారాయణరెడ్డి, సాయిలు ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి



పిట్లం(జుక్కల్): మొక్కలను ప్రతి ఒక్కరూ సంరక్షించాలని పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలోని కారేగాం గ్రామంలో శుక్రవారం వాటర్‌డే సందర్భంగా మొక్కలకు నీళ్లు పట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి మొక్కలే రేపటి వృక్షాలుగా మారి మానవ మనుగడకు ఉపయోగపడుతాయన్నారు. జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



మాచారెడ్డి: మండలంలోని పాల్వంచ ఉన్నత పాఠశాల హిందీ పండిత్ ఉపాధ్యాయుడు పూర్ణచందర్‌రావ్ రాసిన 'మాతృకుసుమాలు' అనే పుస్తకాన్ని శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం జెతాలాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని చద్మల్ తండాలో శుక్రవారం ఉపాధిహామీ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సతీష్ పరిశీలించారు. అనంతరం ఆయన కూలీలతో మాట్లాడారు. కొలతలు సరిగా తీయాలని, కూలీల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



గాంధారి(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ సంజీవు పేర్కొన్నారు. గ్రామంలోని పలు వీధుల్లో శుక్రవారం ఆయన పర్యటించి, ఆయా కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీల్లో చిన్న చిన్న సమస్యలుంటే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ పత్తి శ్రీనివాస్, కార్యదర్శి నాగరాజు తదితరులు ఉన్నారు.

అలరించిన ఫేర్‌వెల్‌పార్టీ

బిచ్కుంద(జుక్కల్): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీ ఎంతో అలరించింది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ నరేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు



దోమకొండలో ముస్తాబైన శివరాంమందిర్



దోమకొండ గడికోటలో శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన మహాదేవుని ఆలయం



అడ్లూర్‌ఎల్లారెడ్డిలోని వీరభద్రేశ్వర ఆలయం



తాండూర్‌లోని త్రిలింగేశ్వరాలయం



భిక్కనూరులోని సిద్ధరామేశ్వర ఆలయం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి)/కామారెడ్డి రూరల్/దోమకొండ/మద్నూర్/నిజాంసాగర్/నాగిరెడ్డిపేట: జిల్లాలోని శైవక్షేత్రాలు నేటి మహా శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో, రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. శనివారం మహా శివరాత్రి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యజ్ఞాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీల ప్రతినిధులు శుక్రవారం పేర్కొన్నారు. జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలైన భిక్కనూరు మండలకేంద్రం సమీపంలోని సిద్దరామేశ్వరాలయం, తాడ్వాయి మండలం సంతాయిపేట్‌లోని భీమేశ్వరాలయంలో, దోమకొండలోని శివరాం మందిర్, గడికోటలోని మహాదేవుని ఆలయం, సదాశివనగర్ మండలం అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామంలోని వీరభద్రేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు భారీగా తరలిరానున్నడంతో తగిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. జిల్లాలోని అడ్లూర్‌ఎల్లారెడ్డిలోగల వీరభద్రేశ్వర ఆలయం సూర్యకిరణాలు పడే ఆలయంగా విలసిల్లుతోంది.

కొనసాగుతున్న శివరాత్రి ఉత్సవాలు..

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి శివాలయంలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అలాగే స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం పోసి కట్నకానుకలు సమర్పించారు. అనంతరం శివభక్త కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.



సంతాయిపేట్ గ్రామశివారులోని భీమేశ్వరాలయం



ఎల్లారెడ్డిలోని నీలకంఠేశ్వరాలయం



దేవునిపల్లి శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పండ్లకు భలే డిమాండ్



బాన్సువాడ టౌన్: మహా శివరాత్రి పురస్కరించుకుని బాన్సువాడలో పండ్ల వ్యాపారులు అమాంతం పండ్ల ధరలను భారీగా పెంచారు. ఉపవాస దీక్షలు ఉండే భక్తులు తప్పక పండ్లను నైవేద్యంగా తీసుకుంటారు. దీంతో ఒక్కసారిగా పండ్ల వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను పెంచారు. అరటి పండ్లు డజన్ రూ.30–40, ద్రాక్ష కిలో రూ.120, దానిమ్మ పండ్లు కిలో రూ.80, రత్నపూరి గడ్డలు కిలో రూ.40, ఆపిల్ కిలో రూ. 100, జామపండ్లు కిలో రూ. 80, ఖర్బుజ రూ.30లకు విక్రయిస్తున్నారు. వ్యాపారులు ఇష్టారీతిన ధరలను పెంచారని కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చేపల సాగుతో ఎంతో లాభం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

రాజంపేట: ఐకేపీ సంఘ సభ్యులు వ్యవసాయ సాగుతో పాటు చేపల సాగు చేపట్టడం ద్వారా లాభాలు పొందవచ్చని ఐకేపీ ఆర్‌ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలో ఫిష్‌పాండ్ ఏర్పాటు కోసం శుక్రవారం ఆయన స్థల పరిశీలన చేశారు. చేపల సాగుకు కోసం స్త్రీనిధి కింద రూ. 3లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. ఫిష్‌పాండ్‌లో సుమారు 2వేల వరకు చేపల సీడ్ పెంచడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న మహిళా సంఘ సభ్యులు సంబంధిత సీసీలను సంప్రదించాలని సూచించారు. ఏపీఎం సాయిలు, సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మమ్మ, సీసీ శ్రీనివాస్, సౌజన్య ఉన్నారు.

సీఎం రాక కోసం ఏర్పాట్లు షురూ!



బాన్సువాడ టౌన్: ఈ నెల చివరి వారంలో సీఎం కేసీఆర్ బాన్సువాడకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో ఉన్న పాత మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటుతున్నారు. 220 మొక్కలకు సుమారు రూ.12 లక్షల వరకు వెచ్చించి డివైడర్ మధ్యలో నాటుతున్నారు. తాడ్కోల్ శివారులో నిర్మించిన 1000 డబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్లే దారిని రెండు వరుసల సీసీ రోడ్డుగా నిర్మిస్తున్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పనులు త్వరిగతిన పూర్తి చేస్తున్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- బాణాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): రాబోయే ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని చూసి పట్టం కట్టాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పిలుపునిచ్చారు. మండలంలోని బాణాపూర్ గ్రామంలో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే పలువురు లబ్ధిదారులకు దళితబంధు యూనిట్లు పంపిణీ చేశారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా మహిళలు, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రూ. మూడు వందల కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు వెల్లడించారు. అలాగే సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా చూస్తున్నామన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సవాలు విసిరారు. ప్రతిపక్షాలు ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవుపలికారు. సర్పంచ్ బండి కవిత, ఎంపీపీ గరీబున్నిసాబేగం, జెడ్పీటీసీ శ్రీలత, మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్, సిద్దారెడ్డి, సంజీవరెడ్డి, నరహరి, పీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులను చెల్లించాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ట్యాక్సీ వాహన యజమానులు పన్నులను చెల్లించాలని, లేదంటే వాహనాలను సీజ్ చేస్తామని ఏఎంవీఐ రజనీ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆమె ట్యాక్సీ వాహన యజమానులు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వాహనదారులు త్రైమాసిక పన్నులు వెంటనే చెల్లించాలన్నారు.

శివాలయానికి విరాళం



బాన్సువాడ టౌన్: పట్టణంలోని పాత బాన్సువాడ శివాలయంలోని శివుడి విగ్రహానికి శుక్రవారం కౌన్సిలర్ గడుమల లింగమేశ్వర్ కిలో పావు వెండి తొడుగును అందజేశారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

ఎమ్మెల్యే చొరవతో పనులు ప్రారంభం



తెగిపడిన విద్యుత్ తీగలు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి శివారులోని నల్లమడుగు రోడ్డుపై కొన్ని రోజుల కిందట విద్యుత్ తీగలు తెగిపడి ప్రమాదకంగా మారాయి. ఎమ్మెల్యే చొరవతో శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతు పనులను ప్రారంభించారు. నల్లమడుగు రోడ్డుపై కొన్ని రోజుల క్రితం చెరుకు ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభం విరిగిపడి వైర్లు రోడ్డుపై పడిపోయాయి. దీంతో ఐదు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రైతులు సమస్యను పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోలేదు. ఈక్రమంలో శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ బాణాపూర్ వెళ్తుండగా పలువురు రైతులు ఎమ్మెల్యే కాన్వాయిని అడ్డుకొని, సమస్యను విన్నవించారు. ఆయన వెంటనే ట్రాన్స్‌కో డీఈ, ఏఈలతో ఫోన్‌లో మాట్లాడారు. ట్రాన్స్‌కో అధికారుల శుక్రవారం సాయంత్రం పనులు ప్రారంభించారు.

శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం



రాజంపేట: మండలంలోని ఆర్గోండ సొసైటీ పరిధిలో శుక్రవారం శనగ కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ కందిశివరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు తాము పండించిన శనగ పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని తెలిపారు. సొసైటీ పరిధిలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సాగర్, మండల రైతుబంధు అధ్యక్షుడు మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వండి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): చాలా కాలంగా సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలిప్పించాలని మండలంలోని పలువురు గిరిజన రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఎంపీపీ రాజ్‌దాస్ ఆధ్వర్యంలో మండలంలోని బెజుగంచెరువుతండా, ఎర్రకుంటతండాకు చెందిన పలువురు గిరిజన రైతులు ఆర్డీవో శ్రీనునాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో వారితో పేర్కొన్నారు.



ముదిరాజ్ మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న మత్స్యశాఖ అధికారులు

బాన్సువాడ టౌన్: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో శుక్రవారం ముదిరాజ్ మత్స్యకారులకు మత్స్యశాఖ డివిజన్ అధికారి దోల్సింగ్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. చెరువులో ఈత కొట్టడం, వల వేయడం, పెద్ద వల లాగడం వంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని మత్స్యపారిశ్రామిక సహకార సొసైటిల్లో సభ్యులుగా చేరుస్తామని ఏడీ విఠల్‌రెడ్డి తెలిపారు. ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు బట్టు విఠల్, సర్పంచ్ జిన్న రఘురామయ్య, ఎంపీటీసీ మల్లారెడ్డి, ముదిరాజ్ సంఘం పెద్దలు ఉన్నారు.

సమాచారం..

■ ఆటోమెటిక్ స్టార్టర్లు తొలగించాలి

గాంధారి(ఎల్లారెడ్డి): రైతులు వ్యవసాయ బోరు మోటార్లకు అమర్చిన ఆటోమెటిక్ స్టార్టర్లను తొలగించాలని సర్వాపూర్ సెక్షన్ ఏఈ రామస్వామి, లైన్‌మెన్ తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఆటోమెటిక్ స్టార్టర్లతో విద్యుత్, భూగర్భ జలాలు వృథా అవుతున్నాయన్నారు. రైతులు స్వచ్ఛందంగా స్టార్టర్లను తొలగించుకోవాలన్నారు.

■ రేపు ఉచిత అంబులెన్స్ ప్రారంభం

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ 15వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని పలు గ్రామాలకు ఉపయోగపడే విధంగా ఉచిత అంబులెన్స్ వాహనాన్ని అందించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెరమాండ్లు ఒక ప్రకటనలో తెలిపారు. అంతే కాకుండా ఉదయం రక్తదాన శిబిరం ఏర్పాటు, ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

■ 22న ఎల్లారెడ్డి ఎక్సైజ్‌లో బైక్ వేలం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 22న ఓ బైక్‌కు వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. టీవీఎస్ మ్యాక్స్ 4ఆర్ టూవీలర్ ఏపీ 25 ఏఈ 5019 నెంబర్ గల వాహనానికి వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ. 3వేలు డిపాజిట్ చేసి, పాల్గొనాలన్నారు. వివరాలకు ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం..

■ సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు



కామారెడ్డి రూరల్: మండలంలోని ఇల్చిపూర్ శివారులోగల సరస్వతీ మాత ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దత్తాద్రి శర్మ, విజయ్‌పాండే, సురేష్‌పాండే ల ఆధ్వర్యంలో అమ్మవారికి లలితా సహస్రనామాలతో కుంకుమ అర్చనలు, అభిషేకాలు చేశారు. అ నంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

■ 23 నుంచి గీతామందిరం ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో గల శ్రీకృష్ణగీతా మందిరం 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి మార్చి 1వరకు నిర్వహించనున్నట్లు గీతా మందిరం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా జ్ఞాన చైతన్య నంద స్వామిజీచే ప్రవచనాలుంటాయని ప్రతినిధులు పేర్కొన్నారు.

■ శబరిమాత ఆశ్రమంలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా శబరిమాత ప్రతిమ, దివ్యసమాదిలను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు





కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న టీఎన్‌జీవోస్.. బిచ్కుందలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సింధే

సాక్షి నెట్‌వర్క్, కామారెడ్డి: జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో శుక్రవారం సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అలాగే పలు గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కలెక్టరేట్‌లో టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.



ఎల్లారెడ్డి పట్టణంలో..

సంక్షిప్తం

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని యూపీఎస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మద్నూర్‌కు చెందిన పలువురు యువకులు నోట్‌బుక్‌లు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. తమ గురువు పవన్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించామని యువకులు తెలిపారు.

రాజంపేటలో పలకలు...

రాజంపేట: మండలకేంద్రంలోని శారద శిశుమందిర్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మండల కేంద్రానికి చెందిన యువనాయకులు దాగ్గారి నరేష్ తన పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు పలకలు, బిస్కట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాస్, సాయి, నరేష్, వరుణ్ ఉన్నారు.

లింగంపల్లిలో టై, బెల్టులు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని లింగంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం గ్రామానికి చెందిన కుమ్మరి సంతోష్‌కుమార్ సహకారంతో టై, బెల్టులు వితరణ చేసినట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. సర్పంచ్ బండి రాజయ్య, రవి, అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేత



కామారెడ్డి రూరల్: మండలంలోని గర్గుల్ గ్రామంలో శుక్రవారం నిరుపేద వధువులకు సర్పంచ్ చింతల రవితేజ గౌడ్ పుస్తెమట్టెలు, ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు శంకర్‌గౌడ్, భూదేవి, యాదగౌడ్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాత బాలుకు సన్మానం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం చైర్మన్, ఐవీఎఫ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలును శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌లు సన్మానించారు. కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌లో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలును సన్మానించారు.

బాధితుడికి పరామర్శ

బాన్సువాడ రూరల్: మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు ఇటీవల ఓ ప్రమాదంలో కాలు విరిగి, గాయపడ్డాడు. దీంతో శుక్రవారం చికిత్స పొందుతున్న నర్సింలును డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పరామర్శించారు.